

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగకుండా పోరాడే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామని రిటైర్డ్ ప్రొఫెసర్, సీఐటీయూ నాయకులు ఎస్ఎమ్ షరీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్(పీడీఫ్) అభ్యర్థులుగా పి. బాబురెడ్డి(ఉపాధ్యాయ), మీగడ వెంకటేశ్వర రెడ్డి(పట్టభద్రులు) పోటీ చేస్తున్నారని తెలిపారు. వారి గెలుపుకు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు శ్రమించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య ఓటర్ల నమోదు, పీడీఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుపై మాట్లాడారు. నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి పాల్గొన్నారు.

తిరుమల సహజ శిలాతోరణంపై అవగాహన

ప్రజాశక్తి -క్యాంపస్

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జి.యస్.ఐ.) శిక్షణ సంస్థ దక్షిణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్, జియో హెరిటేజ్ సైట్ అయినటువంటి తిరుమల సహజ శిలాతోరణం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఆజాది కా అమత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జియోలజిస్ట్ గంజి మల్లేష్ మాట్లాడుతూ 2001లో జిఎస్ఐ ఏర్పాటై 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశంలోని 26 సైట్స్‌ను నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్, జియో హెరిటేజ్ సైట్స్ గా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, అందులో తిరుమలలోని శిలాతోరణం ఒకటని అన్నారు. తెలుగు భాషలో శిల అంటే 'రాయి', తోరణం అంటే రెండు నిలువు వరుసలు లేదా 'వంపు'ని కలుపుతూ ఒక గుమ్మం మీద వేసిన దండలా వంపు 8 మీ (26.2 అడుగులు) వెడల్పు మరియు 3 మీ (9.8 అడుగులు) గా వుంది. ఈ కార్యక్రమంలో సీనియర్ భూవిజ్ఞాన శాస్త్రవేత్త డా. మల్లేష్ గంజి, డా. జి.జే.ఎస్ ప్రసాద్, నిర్దేశకులు కుమారి అనామిక, డా. అజయ్ డే, శ్రీ. అనూప్ దత్త, వరప్రసాద్, భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు , ఎస్ వి యునివర్సిటీ జియాలజీ హెచ్ ఓ డి మధు, జియాలజీ విద్యార్థులు, ఎస్.వి హైస్కూల్ తిరుమల విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుని వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్

తిరుపతి సిటి : పుట్టుకతోనే శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వేలూరు సిఎంసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి హేమకిరణ్ వైద్య ఖర్చుల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అందజేశారు. మూడు లక్షల రూపాయల చెక్కును భూమన నివాసం వద్ద వారి తల్లిదండ్రులకు అందజేశారు. తల్లి దేవిక స్విమ్స్‌లో గత పదేళ్లుగా కాంట్రాక్ట ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

అగ్రి డీలర్ల సర్వసభ్య సమావేశం

తిరుపతి టౌన్ : తిరుపతి జిల్లా అగ్రి డీలర్ల తొలి సర్వసభ్య సమావేశం తిరుపతి స్విక్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఉదయం జరిగింది. ప్రతి ఒక్క డీలర్ సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గౌరవ డీలర్లు ఎం.తిమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, కుమారస్వామి నాయుడు, బాబురెడ్డి, వెంకట రమణారెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం మొదట ఫ్లాట్ ఫామ్ లో రైల్వే ఐ ఆర్ సి టి సికి చెందిన రెస్టారెంట్‌ను జెజిఎం భుజంగరావు ప్రారంభించారు . తిరుపతి రైల్వే స్టేషన్ కి వచ్చే ప్రయాణికులకు నాణ్యమైన రుచికరమైన ఆహార పదార్థాలు అందించడానికి ఈ రెస్టారెంట్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఆహ్వాన సత్కారం

తిరుపతి సిటీ : ఉపముఖ్యమంత్రి కే. నారాయణస్వామిని శనివారం జరగనున్న సదస్సుకు ఆహ్వానం పలికి ఘనంగా సత్కరించారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని దళిత నాయకులు కలిసి దుశ్శాలువతో సత్కరించి పూల గుచ్ఛాన్ని అందించారు. ఎస్వీ యూనివర్సిటీ లోని శ్రీనివాస ఆడిటోరియం నందు నిర్వహించబోయే దళితుల ఆత్మీయ సదస్సుకు ఆహ్వానించారు. దళిత నాయకులు, క్రిస్టియన్ జెఏసి చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, ఎంపీఎస్ మనీ, మల్లారం మధు పాల్గొన్నారు.





ముసురు వాన...మంచిదే..!

పంటలకు అదునుగా వర్షం ... అన్నదాతల్లో హర్షం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఈ ముసురు వర్షం రైతులకు లాభదాయకమే.. ఎటువంటి నష్టం లేదు.. గత నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలకు మత్స్యకారులు, రైతులు, ముంపు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత సంవత్సరంలా వర్షాల వల్ల తీవ్ర నష్టం వస్తుందన్న ఆందోళన వద్దు..' అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు తిరుపతి జిల్లాలో మొత్తం 34 మండలాలు ఉంటే రామచంద్రాపురం, బాలాయపల్లి, తిరుపతి రూరల్ మండలాల్లో అధికశాతంలో వర్షం నమోదయ్యింది. రామచంద్రాపురం మండలంలో 763.4 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 20.7 శాతం అదనంగా నమోదయ్యింది. అలాగే బాలాయపల్లిలో 792.42 మి.మీ. వర్షపాతం పడాల్సి ఉండగా 28.4 శాతం నమోదయ్యింది. తిరుపతి రూరల్‌లో 728.0 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా 22.9 శాతం ఎక్కువగా పడింది.

మిగిలిన 20 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యింది. తక్కువగా 11 మండలాల్లో నమోదయ్యిందని రెయిన్‌ఫాల్ చీఫ్ ప్లానింగ్ విభాగం అధికారికంగా తెలిపింది. ఈ నేపథ్యంలో రేణిగుంట, డక్కిలి, పిచ్చాటూరు, కెవిబిపురం, తడ, వెంకటగిరి, ఏర్పేడు మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదయ్యింది. మిగిలిన అన్ని మండలాల్లోనూ నార్మల్‌గా కురిసింది. గత సంవత్సరం కంటే వర్షపాతం నమోదు తక్కువగా ఉందని పేర్కొంది.

ఇప్పటివరకూ అనుకూలమే

దొరసానమ్మ, వ్యవసాయ అధికారి, తిరుపతి జిల్లా



గత ఏడాదివలే ఈ ఏడాది వర్షపాతం ఎక్కువగా నమోదయ్యి ముంపుకు గురవుతుందేమోనని కంగారుపడ్డాం. గత ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు భారీ వర్షాలు పడటం వల్ల పొలాలే కాదు గ్రామాలే ముంపుకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారులను, రైతులను ముందస్తుగానే అప్రమత్తం చేశాం. ఇప్పటివరకూ పడిన వర్షపాతం నమోదు చూస్తే రైతులకు ఎటువంటి నష్టం లేదు. మేలు చేసే రకంగానే ఉంది. రబీ సీజన్‌లో వరి నాట్లు వేశారు. అయితే రైతులకు నష్టదాయకం ఏమీ లేదు. జిల్లాలో 5,755 ఎకరాల్లో ముఖ్యంగా నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరంగా వేశారు. రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. చిల్లకూరు మండలంలో పత్తి 32 ఎకరాల్లో సాగవుతుంది. ఇది శుభపరిణామం. గతంలో తిరుపతి జిల్లాలో పత్తి పంట పండేది కాదు. రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుంది. గతంలో చెరకు పంట ఎక్కువగా సాగయ్యేది. ఫ్యాక్టరీలు మూతబడడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపారు.

వర్షపాతం వివరాలు

నెల	సాధారణం	నమోదు
జూన్	72.8	66.7
జులై	103.2	100.3
ఆగస్టు	114.0	130.1
సెప్టెంబర్	124.2	116.7
అక్టోబర్	203.5	107.4
నవంబర్	288.9	110.9

ప్రకృతి సేద్యం.. 'పట్టభద్రుల' విజయం

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు
ఉన్నత విద్యనభ్యసించి పొలంబాట
ఆదర్శ దంపతులు శ్రీవాణి, విజయులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

ప్రకతి వ్యవసాయాన్నే నమ్ముకున్నారు.. అందరికీ ఆరోగ్యాన్ని పంచుతున్నారు పట్టభద్రులైన ఆ దంపతులు. ప్రైవేటు ఉద్యోగాలు వదిలి ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకొని మంచి పట్టు సాధించారు. ఉన్నత చదువులు చదివి పదిమందికి ఆరోగ్యం పంచాలనే దఢ సంకల్పంతో వారికున్న రెండెకరాల్లోనే సేంద్రియ వ్యవసాయంతో వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నారు. తన పొలాన్నే ఓ పాఠశాలగా మార్చి రైతులకు ప్రకతి వ్యవసాయంపై శిక్షణ సైతం అందిస్తున్నారు. ప్రజారోగ్యం కోసం నిరంతరం తపిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు పుత్తూరు మండలం సిరుగురాజుపాళెం పంచాయతీ దిగువ గూళూరుకు చెందిన శ్రీవాణి, విజయులు.

పుత్తూరు మండలంలోని సిరుగురాజుపాళెం పంచాయతీ దిగువగూళూరు గ్రామానికి చెందిన దంపతులు శ్రీవాణి, విజయులు ఇద్దరూ డిగ్రీ పట్టభద్రులు. శ్రీవాణి బీఎస్సీ, బీఎడ్. విజయులు బీకాం, బీఎడ్ చేశారు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహం కాగా.. ఉపాధ్యాయులుగా స్థిరపడాలనుకుని విద్యావాలంటీర్లుగా, ప్రైవేటు ఉపాధ్యాయు లుగా వత్తిని కొనసాగించారు. వీరు ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో ప్రకతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ పొందారు. దీంతో 2012 నుంచి వ్యవసాయం చేయడానికి దంపతులిద్దరూ పూనుకున్నారు. వారికున్న రెండు ఎకరాల పొలంలో అప్పటివరకు రసాయనిక ఎరువులతో వరి, వేరుశనగ సాగుచేసేవారు. అవగాహన లోపంతో రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వినియోగిస్తూ అప్పుల పాలవుతున్న వైనాన్ని గమనించారు. ప్రకతి వ్యవసాయం చేయడానికి అవసరమైన సేంద్రియ ఎరువులను వారే తయారు చేసు కోవడం నేర్చుకున్నారు. ఘన జీవామతం, జీవామతం, పంచగవ్యం, నీమాస్త్రం, దనపరిణి కషాయం, బీజామతాలను భార్యాభర్తలే తయారు చేసుకుంటూ వ్యవసాయంలో వినూత్నంగా చేపట్టడానికి పూనుకున్నారు. సేంద్రియ ఎరువులను వాడుతూ కూరగాయల సాగు చేపట్టారు. ప్రధానంగా రెండు ఎకరాల్లోనే వంకాయలు, బెండకాయలు, బీరకాయలు, కాకరకాయలు, సొరకాయలు, టమాటా, బీన్స్‌తోపాటు వివిధ రకాల ఆకు కూరలు సాగు చేస్తున్నారు. పంచగవ్యం, నీమాస్త్రం వంటివి పిచికారీ చేస్తూ పంటలకు రోగాలు రాకుండా కాపాడుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పది మందికి ఆరోగ్యం పంచడమే లక్ష్యంగా ప్రకతి వ్యవసాయం చేస్తూ వినియోగదారులకే నేరుగా విక్రయాలు చేస్తున్నారు.



వినియోగదారులకే విక్రయాలు

ప్రకతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను నేరుగా వినియోగదారులకే అందిస్తున్నారు. ప్రస్తుతం 50 మంది రైతులకు రోజువారీగా కూరగాయలను అందిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. తోట వద్దనే వినియోగదారులు కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. సాధారణ కూరగాయల కంటే రూ.5 అధిక ధరకు విక్రయించినా.. వీరి కూరగాయలకు గిరాకీ మాత్రం తగ్గడం లేదు. దీంతో దంపతులిద్దరూ లాభాలను ఆర్జిస్తున్నారు. పలుమార్లు తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తూ విక్రయించారు.

భవిష్యత్తు తరాలకు సేంద్రియ పంటలే అవసరం

ఒకే పంట కాకుండా వివిధ రకాల పంటలను సాగు చేయడంతో ఆదాయం బాగుంది. మాకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ప్రకతి వ్యవసాయం పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నాం. ఎకరా పొలంలో కూరగాయలు పండిస్తే రోజుకు రూ.2 వేలు ఆదాయం వస్తోంది. ఇద్దరూ కలిసి పొలంలో పనిచేసుకుంటాం. సేంద్రియ ఎరువులతోనే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మన భవిష్యత్తు తరాల వారికి తప్పనిసరిగా సేంద్రియ పంటలే అవసరం. ప్రకతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ. **- శ్రీవాణి, విజయులు, దిగువగూళూరు, పుత్తూరు మండలం**

ప్రకృతి వ్యవసాయంలో అగ్రగామి కావాలి : టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని పెంచడమే గాకుండా, రాష్ట్రంలో నంబర్ వన్‌గా అగ్రగామిగా నిలవాలని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి అన్నారు. శ్వేతలో 24 జిల్లాల నుండి విచ్చేసిన ప్రకృతి వ్యవసాయ రైతులతో ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గతేడాది అక్టోబర్‌లో ముఖ్యమంత్రివర్యులు తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు విచ్చేసినపుడు వారి సమక్షంలో రాష్ట్ర రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్‌తో టిటిడి ఒప్పందం కుదుర్చుకుందన్నారు. శ్రీవారి ప్రసాదాల తయారీకి గో ఆధారిత ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించేందుకు రైతు సాధికార సంస్థ గుర్తించిన రైతుల నుండి మార్క్‌ఫెడ్ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి టిటిడికి అందించాలని, తద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు గతేడాది మొదటి విడతగా ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన 2500 టన్నుల శనగలను కొనుగోలు చేశమన్నారు. వీటిని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ ఐటిసి ప్రయోగశాలలో పరీక్షించగా ఎలాంటి రసాయన అవశేషాలు లేనట్టు గుర్తించారని తెలిపారు. ఈ ఏడాది మరో 12 రకాల ఉత్పత్తులు కలిపి దాదాపు 16 వేల టన్నులు సేకరించాలని టిటిడి బోర్డు నిర్ణయించిందని, ఈ మేరకు రైతు సాధికార సంస్థకు లేఖ ద్వారా తెలియజేశామని చెప్పారు. రానున్న కాలంలో భక్తులకు అన్నప్రసాదాలు అందించేందుకు టిటిడికి అవసరమైన అన్ని వంట సరుకులను ప్రకతి వ్యవసాయం ద్వారా పండించినవే కొనుగోలు చేస్తామన్నారు. రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయకుమార్, మార్క్‌ఫెడ్ ఎండి పిఎస్.ప్రద్యుమ్న మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయ రైతులు దళారుల కారణంగా నష్టపోకుండా మార్క్‌ఫెడ్ పూర్తి పారదర్శకంగా వారి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి త్వరితగతిన సొమ్ము చెల్లిస్తున్నట్టు తెలిపారు. సిఎం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రకతి వ్యవసాయ రైతులతో లావాదేవీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మంచి దిగుబడులు సాధించిన రైతులను టిటిడి ఈవో ఇతర అధికారులు సన్మానించారు.



ఈ కార్యక్రమంలో టిటిడి జెఈవో సదా భార్గవి, రైతు సాధికార సంస్థ సిఈవో రామారావు, టిటిడి మార్కెటింగ్ జిఎం సుబ్రహ్మణ్యం, సిఎస్ఎ రీజనల్ కౌన్సిల్ చంద్రకళ, ఐటిసి ల్యాబ్ శాస్త్రవేత్త డా.కె.సత్యనారాయణమూర్తి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, డెప్యూటీ ఈవో పద్మావతి పాల్గొన్నారు

తాత్కాలిక కార్పొరేషన్ కార్యాలయంలో...

వసతులు లేమి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ తాత్కాలిక కార్యాలయం సరైన వసతులు లేక అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. పాత మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేసి ఐకానిక్ భవనం నిర్మాణానికి 71 కోట్ల రూపాయలతో రెండు నెలల క్రితం భూమి పూజ జరిగింది. కార్పొరేషన్ పాలన సాగించడానికి స్విమ్స్ ఆసుపత్రి సమీపంలోని పాత మెటర్నటి ఆసుపత్రి వద్ద తాత్కాలిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయంలో సుమారు 500 మంది పని చేస్తారు. ఇందులో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పారిశుద్ధ విభాగంతో పాటు సాధారణ పరిపాలన సిబ్బంది ఉంటారు. దాదాపు కోటి రూపాయలతో తాత్కాలిక కార్యాలయంలో పనులు చేపట్టారు. కోటి రూపాయలు ఖర్చు చేసినా అక్కడ వసతులు తక్కువ ఉండడం తో సిబ్బంది ఇబ్బందులు వర్ణనాతీతం. గత 20 సంవత్సరాలు సంబంధించిన ఫైల్సు ఉండడంతో వాటిని ఎక్కడ పెట్టాలో అర్థం కాక తికమక పడుతున్నారు. బీరువాలు కూడా సుమారు 70 పైగా ఉన్నాయి. వాటిని పెట్టడానికి స్థలం లేక వేరు వేరు ప్రాంతాల్లో ఉంచాల్సి వచ్చింది. ముఖ్యంగా ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సంబంధించిన ఫైలే ఎక్కువ ఉంటాయి. ఇంజనీరింగ్ విభాగంలో డీఈలు, ఏఈ లు ఎక్కువ మంది ఉంటారు. ఏఈలకు కూర్చోవడానికి చాంబర్లు లేవు. అలాగే రెవెన్యూ విభాగంలో ఆర్ ఐ లు, బిల్ కలెక్టర్లకు కూర్చోవడానికి చాంబర్ లేదు. దీనికి తోడు కార్పొరేషన్ వార్డ్ అడ్మిన్లు కూడా ఉండడంతో ఇరుకైన ప్రాంతంలో కూర్చోవాల్సి వస్తుంది. మొదటి అంతస్తు లో పరిపాలన చేస్తుండగా రెండవ అంతస్తులో మేయరు, డిప్యూటీ మేయర్లు, కమిషనర్ ఛాంబర్లు ఉన్నాయి. తాత్కాలిక కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల సంబంధించిన వాహనాలు పెట్టుకోవడం కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది కూర్చోడానికీ కుర్చీల్లేవు
బీరువాలు పెట్టుకోడానికి స్థల కొరత
వాహనాల పార్కింగ్‌కూ ఇబ్బందే



గడువులోపు పూర్తవుతుందా..?

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నూతన ఐకానిక్ భవనం 19 నెలల్లో పూర్తి చేస్తామని కమిషనర్ చెబుతున్నారు. ఇది పూర్తిగా స్మార్ట్ సిటీ నిధులతో చేసే పనులు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకంలో నిధులు ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను సకాలంలో ఇవ్వకపోవడంతో చాలా పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కొత్త భవనం 19 నెలల్లో పూర్తవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు సకాలంలో ఇస్తేనే పనులు త్వరగా అవుతాయని కాంట్రాక్టర్ అంటున్నారు. ఆలస్యంగా నిధులు ఇస్తే రెండు నుంచి మూడు సంవత్సరాలు సమయం పట్టే అవకాశం ఉంది. ఏది ఏమైనా స్మార్ట్ సిటీ పథకంలో పనులు త్వరగా పూర్తికావాలంటే రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను సకాలంలో ఇవ్వాల్సి ఉంది.


అర్ధరాత్రి నైట్‌స్వీపింగ్ పరిశీలన

నగర పాలక సంస్థ ఖ్యాతిని పెంచాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుపతి నగరాన్ని శుభ్రత విషయంలో దేశంలో తిరుపతి నగర పాలక సంస్థ ఖ్యాతిని పెంచుతామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. రాత్రిపూట స్వీపింగ్ పనులను ఆమె రాత్రి సమయంలో అకస్మాత్తుగా పరిశీలించారు. రాత్రుల్లో చెత్తను శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా 20 మంది కార్మికులను, ఇద్దరు డ్రైవర్లను కొత్తగా పనుల్లోకి తీసుకున్నామన్నారు. వీరికి సంవత్సరానికి 47.50 లక్షలు ఏజెన్సీ ద్వారా కౌన్సిల్ అనుమతితో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కేటాయించిందన్నారు. ప్రతిరోజూ రాత్రి 9.30 గంటల నుండి ఉదయం 4.30 గంటల వరకు 22 మంది కార్మికులు రోడ్లను శుభ్రపరచడం, డస్ట్ బీన్లను తీయడం చేస్తున్నారని తెలిపారు. ఇక పగలు పూట 210 మంది కార్మికులు, 110 మంది డ్రైవర్ల సహకారంతో తిరుపతిలోని 50 డివిజన్ల నుండి ఇంటింటికి వెళ్లి తడి,పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించి తూకివాకంకి పంపడం జరుగుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ ఆయా పనులపై నిరంతర పర్యవేక్షణ వుండాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వార్డు సచివాలయ ఉద్యోగులు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డిని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఇందులో భాగంగా సుమారు 400 మంది వార్డు సచివాలయ ఉద్యోగులకు గత ఆగస్టు నెలలో సర్వీసులు టార్గెట్ పూర్తి చేయని కారణంగా ఒక రోజు జీతం నిలుపుదల గురించి ఉన్నత అధికారులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు ఇచ్చిన ఇప్పటివరకు ఉద్యోగుల ఖాతాల్లో నిలుపుదల చేసిన జీతాన్ని జమ చేయలేదని పేర్కొన్నారు . సచివాలయ ఉద్యోగులను ఇతర శాఖలకు డిప్యుటేషన్ చేయడం వలన ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పరచినటువంటి సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల అమలులో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం గురించి కలెక్టర్ కి సవివరంగా తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి డిప్యూటేషన్ను వెంటనే రద్దు చేస్తామని, నిలుపుదల చేసిన జీతాన్ని ఉద్యోగులకు ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అలిపిరి ఘటనలో 'ఆంతర్యం' ఏంటి..?

టిటిడి ఆక్టోపస్ దళాలతో గాలింపు
గల్లంతయినవారు దొరికారా..లేదా..
కేసు నమోదుపైనా స్టేషన్లలో తర్జనభర్జన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అలిపిరిలో యువకుల హల్‌చల్ ఎందుకు చేశారో అర్థమయినా, అడవిలో మిస్సయిన ఆ ఇద్దరు యువకులకు సంబంధించిన సమాచారం మాత్రం తెలియలేదు. ఇప్పటికే రెండు రోజులయ్యింది. అక్టోపస్ దళాలతో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ శేషాచలం అటవీ ప్రాంతంలో గాలించారు. ఆ ఇద్దరి ఆచూకీ లభించకపోవడంతో అదుపులో ఉన్న ఆ ముగ్గురిని అలిపిరి పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో ప్రవల్లిక ఇచ్చే సమాచారం కీలకం కావడంతో ఆమెను అలిపిరి పోలీసులు పిలిపించారు. అయితే ఈ కేసు తమ పరిధి కాదని అలిపిరి పోలీసులు, తమ పరిధి కాదని రేణిగుంట పోలీసులు ఇప్పటికీ తర్జన భర్జన పడుతూనే ఉన్నారు. గల్లంతయిన కార్తీక్, రాము దొరికారని, హైదరాబాద్ వెళ్లిపోయారని, తిరిగి రెండు రోజుల్లో వస్తారనీ చెబుతుండటంపైనా కేసుకు సంబంధించిన 'ఆంతర్యం' ఏమిటో అర్థం కాని పరిస్థితి.

అసలేమయిందంటే ?

శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులతో అలిపిరి తనిఖీ కేంద్రం నిత్యం రద్దీగా ఉంటుంది.. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో కారు దిగిన యువకుడు తనను కిడ్నాప్ చేసారంటూ టిటిడి విజిలెన్స్ సిబ్బందిని ఆశ్రయించిన ఘటన తీవ్ర కలకలం రేపింది.. ముగ్గురిని అదుపులోకి తీసుకోవడం, మరో ఇద్దరు వాహనంను టోల్ గేట్ లో ఆపకుండా ఘాట్ లోకి వెళ్ళి ఎస్కేప్ అయ్యేందుకు ప్రయత్నించారు.. దీంతో ఆ వాహనంను అలిపిరి టోల్ గేట్ సిబ్బంది మరో వాహనంలో వెంబడించి లింక్ రోడ్డు సమీపంలో అడ్డుకున్నారు.. వాహనంను విజిలెన్స్ సిబ్బంది అడ్డుకోవడంతో ఆ ఇద్దరు యువకులు పక్కనే ఉన్న లోయలోకి దిగారు.. ఆక్టోపస్ సిబ్బంది, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది ఎంత వెతికినా ఆ ఇద్దరి ఆచూకీ మాత్రం లభించలేదు. అదుపులో ఉన్న ముగ్గురిని రేణిగుంట పోలీసులకు విజిలెన్స్ అధికారులు అప్పగించారు.

వివాహేతర సంబంధమే కారణమా..?

తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన రాహుల్ చైతన్య, అదే ఊరికి చెందిన ప్రవల్లికను మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే కొద్ది రోజుల వరకూ అన్యోన్యంగా ఉన్న వీరిద్దరూ మనస్పర్థల కారణంగా గత కొద్ది రోజులుగా దూరంగా ఉంటున్నారు.. వత్తిరీత్యా రాహుల్ చైతన్య తిరుపతి జిల్లా, రేణిగుంటలోని గౌరినగర్‌లో నివాసం ఉంటున్నాడు. రాహుల్ చైతన్య ,ప్రవల్లిక కుటుంబ సభ్యులు ఇద్దరికీ సర్ది చెప్పడంతో ప్రవల్లికను రేణిగుంటలో కాపురం పెట్టేందుకు ఒప్పుకున్నాడు.. అప్పటి నుండి ప్రవల్లిక తన భర్త రాహుల్ చైతన్యతో ఫోన్లో సంభాషిస్తూ వచ్చేది.. ఈక్రమంలో వారం క్రితం రాహుల్ చైతన్య పుట్టిన రోజు రావడంతో ప్రవల్లిక తన భర్తకు సర్‌ప్రైజ్ చేసేందుకు రేణిగుంటకు వచ్చింది. సర్‌ప్రైజ్ చేద్దామని వచ్చి వేరే మహిళతో భర్త సన్నిహితంగా ఉండటం చూసిన ప్రవల్లిక మనోవేదనతో తిరిగి రాజమండ్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ప్రవల్లిక అన్న గణేష్ తాను స్నేహితులతో కలిసి తిరుమలకు వెళుతున్నానని చెప్పి రాహుల్‌తో మాట్లాడతానని చెప్పి ఓదార్చాడు. తిరుమల యాత్రకు స్నేహితులతో కలిసి బయల్దేరిన ప్రవల్లిక అన్న రేణిగుంటకు చేరుకుని తిరుమలకు వెళుతున్నానని, తనతో రావాలని కోరాడు. రాహుల్ చైతన్యను కారు ఎక్కించుకుని వెళుతూ తన చెల్లి రేణిగుంటకు వచ్చిన సమయంలో మరో మహిళతో ఉన్న విషయమై ప్రస్తావించాడు. దీంతో తనను ఎక్కడ కొడతారోనని భయపడిన రాహుల్ చైతన్య అలిపిరి టోల్‌గేట్ చేరుకోవడంతో కారు దిగి తనను కిడ్నాప్ చేశారంటూ గట్టిగట్టిగా కేకలు వేస్తూ అక్కడే ఉన్న టిటిడి విజిలెన్స్ సిబ్బందిని ఆశ్రయించడంతో సీన్ ప్రారంభమయ్యింది. రాహుల్ చైతన్యను పట్టుకునేందుకు వచ్చిన లోకేష్, గణేష్, రాజేష్‌లను టిటిడి సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. దీనిని గమనించిన కారు డ్రైవర్ వెంటనే కారును టోల్‌గేటులో ఆపకుండా రెండో ఘాట్‌రోడ్డులోకి పోనిచ్చాడు. మరో వ్యక్తి కూడా టోల్‌గేటు దాటి వాహనాన్ని ఎక్కి ఘాట్‌రోడ్డులో వేగంగా పోనిచ్చారు. అయితే వాహనాన్ని వెంబడించిన టిటిడి విజిలెన్స్ పోలీసులు రెండో ఘాట్‌రోడ్డులోని లింక్ రోడ్డు వద్ద అడ్డుకున్నారు. అయితే తమను ఎక్కడ అరెస్టు చేస్తారోనని భయపడిన ఆ ఇద్దరు యువకులు కార్తీక్, రాము పక్కనే ఉన్న లోయలో దిగి పరారయ్యారు. ఈ కారు కలకలం వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.




సూర్య ఎలివేటర్స్ అంచెలంచెలుగా 'పైపైకి'



ప్రజాశక్తి-తిరుపతి సిటి

'మీ అపార్ట్‌మెంట్లో లిఫ్ట్ పనిచేయడం లేదా.. మీ ఆఫీసులో లిఫ్ట్ మరమ్మతులకు గురైందా. అయితే నాణ్యత ప్రమాణాల్లో ఎదురులేనిదిగా ఉన్న సూర్య ఎలివేటర్స్‌ను సంప్రదించాల్సిందే.' లీలామహల్ రోడ్డులోని సూర్య లిఫ్ట్స్ అధినేత మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ప్రజాశక్తితో మాట్లాడుతూ దాదాపు 22 సంవత్సరాలుగా ప్రముఖ పట్టణాలైన బెంగళూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి నగరాలలో కమర్షియల్, షాపింగ్ కాంప్లెక్స్ హైసెన్, ఆఫీసులకు లిఫ్ట్‌లను అందిస్తున్నామన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నాణ్యతకు పెట్టింది పేరుగా టిటిడి వంటి ధార్మిక సంస్థలో భక్తుల అవసరాలకు, అధికారుల సూచనల మేరకు నిరంతరం కొత్త ఉత్పత్తులతో లిఫ్ట్‌లను తయారు చేస్తున్నామన్నారు. సూర్య ఎలివేటర్స్ ప్రైవేటు లిమిటెడ్, లీడర్స్ ఇన్ ఎలివేటర్స్ సిస్టమ్స్ ద్వారా మన్నికైన లిఫ్టులను అందిస్తున్నట్లు తెలిపారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల ఉత్పత్తి రంగంలో అగ్రగణ్యులైన మాంటెఫ్రో-మోరిన్, సంస్థ ఉత్పాదనలు ప్రస్తుతం అందుబాటులోకి రావడం వినియోగదారులందరికీ అనందదాయకంగా ఉందన్నారు. అత్యంత భద్రతా ప్రమాణాలు, సౌకర్యం , అందం ఆకర్షణలతో లిఫ్టులను విక్రయిస్తున్నామని తెలిపారు. ఇంటికైనా, అపార్ట్‌మెంటుకైనా, కర్మాగారం, కార్యాలయానికైనా పిల్లలు సైతం అత్యంత నమ్మకంగా వాడదగిన మన్నిక, దృఢత్వం, నాణ్యత కలిగిన ఉత్పాదనలు సూర్య ఎలివేటర్స్‌కే సొంతమన్నారు. లిఫ్ట్ సంబంధిత సమస్యలకు, లిఫ్ట్ సౌకర్యాల కొరకు సూర్య ఎలివేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ 08772258299, 9959875577 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సి.ప్రవీణ్ కుమార్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద ఆశీర్వాదం మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, విఐ రామ్మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, దామోదర్, ఆశోక్, ఆలయ అర్చకులు బాబుస్వామి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికులకు ఇక్కట్లు



ప్రజాశక్తి -బాలాయపల్లి: వెంకటగిరి- గూడూరు ప్రధాన రహదారిలో శుక్రవారం వెంకటగిరి ఆర్టీసీ బస్సు మొరాయించడంతో పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయులు, అధికారులు అవస్థలు పడ్డారు. వెంకటగిరి ఆర్టీసీ డిపోలో ఉన్న బస్సులు డొక్కువి కావడంతో ఎక్కడపడితే అక్కడ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు మాట్లాడుతూ పాఠశాలలో ఎఫ్ఏ-వన్ పరీక్షలు జరుగుతున్నాయని తాము సకాలంలో పాఠశాలకు చేరుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు: ఎమ్మెల్యే భూమన

గృహ నిర్మాణాలలో పురోగతి వుండాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి పేదవాళ్లకు ఇంటి పట్టా, ఇళ్లు మంజూరు హామీ మేరకు నగర పరిధిలో అర్హత గల వారికి తప్పనిసరి 90 రోజుల కార్యక్రమంలో మంజూరు చేయాలని తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకరరెడ్డి అధికారులకు సూచించారు. తిరుపతి నగరపాలక పరిధిలో లబ్దిదారులకు కేటాయించిన గృహనిర్మాణాలకు కావలసిన మెటీరియల్ సరఫరా ఆర్‌డిఓలు, తహశీల్దారులు తక్షణ చర్యలు చేపట్టి వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలో కేటాయించిన గృహ నిర్మాణాల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆర్డీఓలు తిరుపతి, శ్రీకాళహస్తి కనకనరసా రెడ్డి, రామారావు, హౌసింగ్ పీడీ చంద్రశేఖర్, ఏఈలు రేణిగుంట, చంద్రగిరి, తిరుపతి తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

రూ.78లక్షలతో జూనియర్ కళాశాల అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిచ్చాటూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.78 లక్షలతో నాడు -నేడులో అభివృద్ధి చేస్తున్నట్లు సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు. మండల కేంద్రమైన పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధితో పాటు తుడా ప్రత్యేక నిధులతో అరణియర్ ప్రాజెక్టు అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో పర్యాటక రంగం అభివృద్ధి చెంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పిచ్చాటూరుని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీఏకే కుమార్

ప్రజాశక్తి-గూడూరు, గూడూరు రూరల్: ప్రైవేట్ ఆన్లైన్ సేవలకు దీటుగా తపాలా శాఖ ఆన్లైన్ సేవలను రూపొందించిందని వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గూడూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వి ఏకే కుమార్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం అవినీతి నిరోధక రహిత భారతదేశ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం గూడూరు ప్రధాన తపాలా శాఖ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరిండెంట్ మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆన్లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అధిక వడ్డీ రేట్లు గల పోస్టల్ స్కీమ్స్, బాలికల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన సుకన్య సమృద్ధి యోజన పథకం అందరూ సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

కెవిపిఎస్ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - వరదయ్యపాలెం: కెవిపిఎస్ మహాసభలను జయప్రదం చేయాలని కెవిపిఎస్ నాయకులు భాష స్థానిక ప్రజలను కోరారు. శుక్రవారం నాడు గోపాల్ రావు కాలనీ వాసులను కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. అనంతరం నవంబర్ 12వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగే కెవిపిఎస్ మహాసభలను జయప్రదం చేయవలసిందిగా స్థానిక ప్రజలు, నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో రాజీ, రూప, సుభాషిని, నాగమ్మ, స్నేహ, జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయు ముఖ్య సలహాదారుగా వైడి కుమార్



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: ఏపీపీడీ ఎన్ఎంయూ జిల్లా ముఖ్య సలహాదారుగా శ్రీకాళహస్తి డిపోకు చెందిన వైడి కుమార్ నియమితులయ్యారు. తిరుపతి రీజనల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఎన్ఎంయూ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా పెరుమాల్, కార్యదర్శిగా సురేంద్రబాబు, చీఫ్ అడ్వైజర్‌గా వైడీ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా గుణశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.చిరంజీవి ఎన్నికయ్యారు. ఎన్ఎమ్ యూ జిల్లా ముఖ్య సలహాదారుగా ఎన్నికైన వైడీ కుమార్‌కు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో తరపున అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణాలు తనిఖీ

ప్రజాశక్తి -పుత్తూరుటౌన్: రూరల్ మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీలో జగనన్న హౌసింగ్ కాలనీని పుత్తూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఇందిరమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని త్వరగా పూర్తిచేసేందుకు తగుచర్యలు చూపాలని సర్పంచ్ విరిత దేవేంద్ర రెడ్డి ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- రేణిగుంట: ప్రతి ఒక్కరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఓ శ్రీహరి తెలిపారు. రేణిగుంట పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి, అక్కడి కాలువల పారిశుధ్యాన్ని పరిశీలించారు. ప్రజలకు ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చక్ర ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అటవీతల్లి అరణ్యరోదన..

- తరిగిపోతున్న వృక్ష సంపద..
- విలవిల్లాడుతున్న మూగజీవాలు



ప్రజాశక్తి - ఓజిలి : అటవీ తల్లి అరణ్య రోదనకు గురవుతుంది. అడవుల్లో విలువైన వృక్ష సంపద రోజురోజుకూ తరిగిపోతోంది. కొందరు వ్యక్తుల ధనదాహానికి వనదేవత నిలువునా దహించుకు పోతోంది. అడవులు తరిగిపోతున్న కారణంగా ఇటు పర్యావరణం దెబ్బతినడమే కాకుండా వన్యప్రాణుల జీవనానికి సైతం ముప్పు వాటిల్లుతోంది. మానవ మనుగడకు సంబంధించిన తొలి అడుగులు ప్రస్థానం అడవుల నుండే ప్రారంభమైంది. సృష్టి ఆరంభం నుండి మానవునితో పాటు, జీవకోటి మనుగడ ఎంతో విలువైన పాత్రను పోషించిన అడవులు మునుపెన్నడూ లేనంత సంకటస్థితిని ఎదుర్కొంటున్నాయి. మానవ నాగరికత నిర్మాణంలో ఎంతో విలువైన పాత్రను పోషించిన అడవుల ఆధునిక మానవుని వినియోగ దృష్టి సోకి అత్యంత వేగంగా అంతరించి పోతున్నాయి. అటవీశాఖ ఓజిలి లో స్వేచ్ఛగా సేద తీరుతున్న మూగజీవాలు, పక్షులకు రక్షణ కరువైంది. సమస్త జీవకోటికి ప్రాణవాయువులు అందించిన అడవులు నేడు తమ ఆయువును కోల్పోయే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి.

కబ్జాదారుల కళ్ళు అటవీ ప్రాంతం మీద పడడంతో వందల ఎకరాల అటవీ సంపదను నాశనం చేస్తూ సాగు భూములుగా మార్చేస్తున్నారు. ఇంత తంతు జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంలో అంతర్గతం ఏమిటో అని ప్రశ్నార్థకంగా మారింది. బాలాయపల్లి, నాయుడుపేట, గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని ఓజిలి మండలంలోని ఇనుగుంట, రాగిపాడు, అత్తివరం, కొండవల్లిపాడు, చుట్టుగుంట, ఆర్మెనుపాడు, చిలమానుచేను , కుందాం, సగుటూరు తదితర ప్రాంతాల్లో అటవీశాఖకు సంబంధించిన వేలాది ఎకరాల అటవీ శాఖ భూములు ఉన్నాయి. ఈ భూములపై అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ సన్నగిల్లడంతో కొన్ని ప్రాంతాల్లో పోడు భూములుగా మరికొన్ని ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తరలింపు కొనసాగుతుంది. విలువైన అటవీ సంపదను కొంతమంది అక్రమార్కులు నరికివేయడంతో అటవీలో సంచరించే మూగజీవాలకు రక్షణ లేకుండా చేస్తుంటే అటవీ శాఖ అధికారులు ఏం చేస్తున్నట్టు అని పలు విమర్శలకు తావిస్తుంది. ఒక్క సెక్షన్ లో చాలా బీటులు ఉంటాయి. ఒక్కొక్క బీటికి ఒక్క బీట్ ఆఫీసర్ ఉంటారు. వారిపై పర్యవేక్షణ అధికారి, సెక్షన్ అధికారి ఉన్నారు. కింద స్థాయి సిబ్బంది ప్రతినిత్యం వారి రేంజ్ పరిధిలోని అడవిలో ఏం జరుగుతుందని పర్యవేక్షించి ఉన్నత అధికారులకు సమాచారం తెలపాల్సి ఉంది. కానీ వీరి పర్యవేక్షణ లోపమా..లేక అవినీతికి పాల్పడుతున్నారా ? ఇలా పలు ప్రశ్నలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. ఏదేమైనప్పటికీ అటవీ శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అటవీశాఖ భూములను ఆక్రమించుకుంటే చర్యలు తప్పవు



అటవీశాఖ సంబంధించిన భూములను అక్రమంగా ఆక్రమించుకొని పోడు భూములుగా మార్చుకుని సాగు చేసుకుంటే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇది వరకే మా దృష్టికి వచ్చింది. దీనిపై అటవీశాఖ భూములపై రీసర్వే నిర్వహించాలని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. – వి.సుహాసిని, డిప్యూటీ రేంజ్ అధికారిణి, బాలయ్యపల్లి


రీ సర్వేలో అటవీశాఖ భూములు గుర్తించడం జరుగుతుంది



అక్రమంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్న అటవీ శాఖ భూముల్లో అటవీశాఖ అధికారులతో కలిసి రీ సర్వే నిర్వహిస్తాము. అటవీశాఖకు సంబంధించిన భూములను గుర్తించి అటవీశాఖ హద్దులను ఏర్పాటు చేస్తాం.– డి.లాజరస్, తహశీల్దార్, ఓజిలి

రుణాల పేరుతో కోట్లు స్వాహా

- అమాయక గిరిజన మహిళలే టార్గెట్
- సంఘ మిత్రాలు, బ్యాంక్ అధికారులపై పలు అనుమానాలు
- మొత్తం ఏపిఎం చెప్తేనే చేసాం
- కింద స్థాయి వెలుగు సిబ్బంది, ఈవో లీడర్లు



విచారణ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: అమాయక గిరిజన మహిళలను టార్గెట్ చేసి కోట్లలో రుణాల రూపంలో నిధులను స్వాహా చేసిన ఘటన మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి...

వరదయ్యపాలెం మండలం వెలుగు కార్యాలయానికి సంబంధించి సుమారు 62 గ్రూపులు పైగా రుణాల నిధులు దారి మళ్లినట్లు కొన్ని రోజులుగా ఒక వివాదం నడుస్తోంది. ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా అధికారులు, ఐకేపీ డీపీఎం మాధవి జిల్లా లీగల్ కో-ఆర్డినేటర్ గెరటారెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ డాంగే యాదవ్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఇందులో పలు ఆసక్తికరమైన విషయాలు అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలంటే పొదుపు సంఘంలో మహిళలై ఉండాలి. ఒక మహిళ ఒక సంఘంలో మాత్రమే ఉండాలి. 60 ఏళ్ల లోపు మహిళలై ఉండాలి. ఇలా అనేక రకాల నియమ నిబంధనలు ఉన్నప్పటికీ ఇలాంటి నిబంధనలు ఏవి పాటించకుండా అనేకమంది మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయంపై స్థానిక సంఘం మిత్రులను విచారించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు కళ్ళు మూసుకొని నిజా నిజాలు నిర్ధారణ చేసుకోకనే వచ్చిన వారికి, వెలుగు అధికారుల మాటలు వినిలోన్లు కేటాయించడం కొసమెరుపు. దాదాపు రూ.3 కోట్ల నిధులు దారి మళ్లినట్లు అధికారులు గుర్తించారు. విచారణ ఇంకా పూర్తి కాలేదని అధికారులు తెలిపారు. ఈ భారీ మొత్తంలో జరిగిన నిధుల మళ్లింపులో బ్యాంక్ అధికారులు, సంఘమిత్రలు, ఏపీఎం పాత్ర ఎంత ఉన్నదో విచారణానంతరం తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా అధికారుల చేతివటానికి అమాయక గిరిజన మహిళలు బలయ్యారంటూ ఇప్పటికైనా నిందితులను వెంటనే గుర్తించి అమాయకులకు త్వరగా న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయం

రాష్ట్ర మంత్రి ఆర్‌కేరోజా



ప్రజాశక్తి -పుత్తూరుటౌన్: ఉద్యోగావకాశాలు కల్పించడమే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. శుక్రవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సొసైటీఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్, ఏ.పీ.ఎస్.ఎస్.డి.సి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జాబ్ మేళాను ప్రారంభించారు.

స్కిల్ హబ్‌సెంటర్ ఏర్పాటు

పుత్తూరు డిగ్రీకళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి రోజా శుక్రవారం ప్రకటించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పద్మజ, సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ డిఎం సరిత, ఏ.పి.ఎస్.ఎస్.డి.సి మేనేజర్ గుణశేఖర్, నగరి, పుత్తూరు మునిసిపాలిటీ ఛైర్మన్లు ఏ.హరి, వైస్ ఛైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, కౌన్సిలర్లు జాన్ కెనడి, బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ కేవీఎంఎన్ రెడ్డి, పుత్తూరు మండల ఎంపీపీ మునివేలమ్మ, నగరి, పుత్తూరు, నింద్ర, వడమాలపేట, విజయపురం మండలం ఎంపీటీసీలు, సర్పంచులు, ఆలయ కమిటీ ఛైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం పరిశోధక విద్యార్థి బొడుగు రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేష్ కు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

రథం ట్రయల్ రన్ విజయవంతం

ప్రజాశక్తి -తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేదీ జరగనున్న రథోత్సవాన్ని పురస్కరించుకొని ట్రయల్ రన్ విజయవంతంగా టిటిడి అధికారులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం పద్మావతి అమ్మవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో రథం ఊరేగింది. ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ట్రయల్ రన్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి ఆలయ అర్చకులు బాబు స్వామి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై జాతీయ వెబినార్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర లా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత చట్టాల కింద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై జాతీయ వెబినార్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెబ్‌నార్ అతిథి స్పీకర్‌గా సుప్రీంకోర్టు న్యాయవాది, స్క్రైబోర్డ్ వ్యవస్థాపక భాగస్వామి డి.రోడ్నీ రైడర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమం హోస్ట్ వి.హరికృష్ణ వెబినార్ సారాంశం తెలియజేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భారతీయ న్యాయవ్యవస్థలో దాని పరిణామంపై వక్త వివరించారు. వివిధ న్యాయ కళాశాలల విద్యార్థులు కె. పవన్ కళ్యాణ్, వి హరికృష్ణ, మహేంద్ర, రీనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆర్డీఓ కనకనరసారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కనక నరసారెడ్డి


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేస్తే అటువంటి వారిని గుర్తించి పిసిపిఎన్‌డిటి యాక్ట్ ద్వారా కఠినంగా శిక్షించాలని తిరుపతి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కనకనరసారెడ్డి సూచించారు. శుక్రవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పై సబ్ డివిజనల్ మల్టీ లెవెల్ అప్రాక్రియేట్ అథారిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఆర్డిఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా లేదా ప్రోత్సాహించినా లేదా సహకరించినా వారికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 50వేలు జరిమానా మొదటి తప్పుగా విధిస్తారని డిప్యూటీ డిఎం హెచ్ఓ హెచ్చరించారు. రెండవసారి చేస్తే ఐదు సంవత్సరాల శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తారని, వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది ఇటువంటి నేరానికి పాల్పడితే వారి పేర్లను మెడికల్ కౌన్సిల్‌కు తెలియజేసి రిజిస్ట్రేషన్ రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ డిటి. సుధారాణి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ తిరుపతి, నిర్మల, రేడియాలజిస్టు డాక్టర్ విద్య, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిడిపిఒ సుధారాణి, డెమో సెక్షన్ నుంచి రామచంద్రయ్య, టాటాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, ఎన్జీవోలు సివిస్డి, షార్ప్ పరివర్తన సేవాసంస్థ వారు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో తుమ్మలగుంట నలంద నగర్‌లో నూతనంగా ప్రారంభించిన ఫిజియోథెరపీ ఫిట్నెస్ సెంటర్, కంటి విభాగంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ సుకుమార్ డాక్టర్ సుధారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, ఉచిత వైద్య శిబిరంలో ఎముకల సాంద్రత పరీక్షలు (బిఎండి), కంటికి సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయబడుతుందని, ఈ అవకాశాన్ని నగర, పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు అరెస్టు



ప్రజాశక్తి-తిరుచానూరు: 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను గ్రాండ్ రిడ్జ్ పక్కన చెరువులో పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలంలోని, హోటల్ గ్రాండ్ రిడ్జ్ ప్రక్కన, తిరుచానూరు చెరువులో ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు, సిబ్బంది నిఘా ఉంచి 1. ఏపి లోకేష్ (తిరుపతి), 2. సెల్వమ్ (చిత్తూరు), 3. వాసు (తిరుపతి), 4. కిషోర్ (చంద్రగిరి) లను అరెస్టు చేశారు. వారి వారి వద్ద నుండి సుమారు రూ.4 లక్షల విలువ గల 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుల్ని రిమాండుకు తరలించారు. వీరు పలు దొంగతనాల కేసులలో ముద్దాయిలుగా ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో

13 మందికి గాయాలు

ప్రజాశక్తి-పాకాల: ఆర్టీసీ బస్సును వెనకనుంచి ఢీకొనడంతో టెంపోలో ఉన్న 13 మందికి గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నేండ్రగుంట ఈనాడు కార్యాలయం వద్ద ముందు వెళుతున్న కర్ణాటక కు చెందిన ఆర్టీసీ బస్సు కేఏ07 ఎఫ్ 1789ను వెనుక వస్తున్న తమిళనాడుకు చెందిన టీఎన్ 69 బిజెడ్ 9865 నెంబర్ గల టెంపో ఢీకొంది. దీంతో టెంపోలో ప్రయాణిస్తున్న 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పాకాల సీఐ రాజశేఖర్, ఎస్ఐ రామకృష్ణ, అగ్ని మాపక అధికారి విశ్వనాథం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి, క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాకాల సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

అనాథ మృతదేహానికి కమిషనర్ నివాళి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని పురపాలక సంఘం ఒకటవ వార్డు కేబీఆర్ అగ్రహారం వద్ద అనాథ వృద్ధుడు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు మృతి చెందాడు. స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనాథ వృద్ధుడు పేరు మాణిక్యం అని ఎక్కడి నుంచో వచ్చి గత కొద్ది రోజులుగా అగ్రహారం గ్రామంలో ఒక కొట్టంలో నివసిస్తూ ఎవరైనా అన్నం పెడితే తిని జీవనం సాగిస్తూ ఉండేవాడు. శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది సహకారంతో దహనక్రియలు చేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

అక్రమ కేసులు బనాయించడం అన్యాయం

చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి



ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: న్యాయం అడిగిన బీసీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి అన్నారు. శుక్ర వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో బీసీ నాయకులైన రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గురవా రెడ్డి, ఇతర బీసీ నాయకుల మీద పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని షణ్ముగ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్‌టియుసి సమన్వయ కార్యదర్శి, పండారం మణి రెడ్డి, జిల్లా బీసీ సెల్ మీడియా కో-ఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.


ప్రతి భవన నిర్మాణ కార్మికునికి..

రూ.10వేలు ఉచితంగా ఇవ్వాలి



ప్రజాశక్తి -సత్యవేడు: రాష్ట్రంలో ఉన్న అర్హులైన భవననిర్మాణ కార్మికులందరికీ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి ప్రతి సభ్యునికి రూ.10వేలు ఉచితంగా ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.మునిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సత్యవేడు ఎన్జీవో హోంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సత్యవేడు మండల మూడవ మహాసభ ఏ.బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెండా ఎగరవేసి మహాసభను ప్రారంభించారు. వివిధ కారణాల రీత్యా భవన నిర్మాణ రంగంలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.మునిరాజు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని తెలియజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు డి.అరుణాచలం, సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ సంఘటితమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేసి కార్మికుల హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం తాత్కాలిక కన్వీనర్స్ కమిటీని ఏర్పాటు చేశారు.

బత్తెన మధుబాబు జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి -తిరుపతి (మంగళం): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి జన సైనికులు ఎప్పుడు ముందుంటారని, తిరుపతి నగరం స్మార్ట్ సిటీ జాబితాలో స్థానం సంపాదించడానికి అహర్నిశలు పనిచేసి ఆ స్థానాన్ని పొందడానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించిన పారిశుద్ధ్య కార్మికులు నివసించే స్కావెంజర్ కాలనీలో పుట్టినరోజును జరుపుకోవడం ఆనందంగా ఉందని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తెన మధుబాబు స్పష్టం చేశారు. శుక్ర వారం తిరుపతి నగర పరిధిలోని స్కావెంజర్ కాలనీలో బత్తెన మధుబాబు జన్మదిన వేడుకలను స్థానిక పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడి స్థానికులకు అన్నదానం, వస్త్రా లను పంపిణీ చేశారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, బాలాజీ, అశోక్, హేమంత్, ముఖేష్, సాయి, పురుషోత్తం, రాజేష్, యువత పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో డ్రోన్స్ టెక్నాలజీపై శిక్షణ



డ్రోన్ టెక్నాలజీని విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్) ఈసీఈ విభాగం వారు డిజైన్ అండ్ హావరింగ్ ఆఫ్ ఏరియల్ వెహికల్ అనే అంశంపై గత నెల 31 నుంచి వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోయంబత్తూరులోని గ్రీన్‌టెక్ ఏవియేషన్ సంస్థ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కార్తికేయన్ సోర్సింగ్ ఆఫీసర్ నెహ్రూ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అధ్యాపకులకు, ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు అసెంబ్లింగ్ ఆఫ్ డ్రోన్స్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ ఆఫ్ డ్రోన్స్ అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాధమునిరెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాదముని రెడ్డి మాట్లాడుతూ డ్రోన్స్ ఉపయోగాలు గురించి వివరించారు. హెచ్ఓడి డాక్టర్ ఎన్. పుష్పలత మాట్లాడుతూ మానవ రహిత వైమానిక వాహనాల నైపుణ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో 200 మంది ఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు డాక్టర్ పి.హరీష్, ఎన్.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.